
వ్యవసాయ క్షేత్రానికి ట్రాక్టర్‌లో వెళుతున్న చంద్రబాబు

ప్రతి ఎకరాకు నీరందిస్తా..

- గాలేరు నగరి ఏడాదిలో పూర్తి
- జిల్లాలో జలాశయాలు కళకళ
- ఇండస్ట్రియల్ హబ్‌గా కొప్పర్తి
- సీఎం చంద్రబాబు టూర్ సక్సెస్


అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు, హాజరైన రైతులు


చిన్న దాసర్లపల్లె వద్ద వ్యవసాయ క్షేత్రంలో రైతులతో మాట్లాడుతున్న సీఎం

(కడప-ఆంధ్రజ్యోతి): గాలేరు-నగరి ప్రాజెక్టును ఏడాదిలో పూర్తి చేస్తాంమని, ప్రతి ఎకరాకు సాగునీరిచ్చి సీమను సస్యశ్యామలం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ రెండో విడత నిధులను పెండ్లిమర్రి మండలంలోని భైరవగుట్ట వద్ద ఏర్పాటు చేసిన రచ్చబండలో విడుదల చేశారు. ప్రధాని మోదీ కోయంబత్తూరులో పీఎం కిసాన్ పథకం ప్రారంభించగా సీఎం చంద్రబాబుతో సహా ఎల్‌ఈడీ స్ర్కీన్‌లో పలువురు తిలకించారు. అనంతరం చంద్రబాబు రెండో విడత రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.3,135 కోట్లు జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రతనాల సీమగా ఉన్న రాయలసీమ రాళ్లసీమగా మారిందన్నారు. ఇక సీమపై ఆశలు వదులుకునే సమయంలో దివంగత ఎన్టీఆర్ ప్రాజెక్టులకు అంకురార్పణ చేశారన్నారు. తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, కేసీ కెనాల్ ఆధునీకరించారన్నారు. ఇక పట్టిసీమతో 120 టీఎంసీల క్రిష్ణా డెల్టా నీటిని సీమకు ఇస్తున్నామన్నారు. జిల్లాలో రిజర్వాయర్లు, చెరువులు 95 శాతం నీటితో కళకళాడుతున్నాయన్నారు.

హార్టికల్చర్ హబ్‌గా మారుస్తా

కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్‌గా మారుతుందని, ఇక్కడికి పరిశ్రమలు వస్తాయన్నారు. జిల్లాలో సోలార్, విండ్ పంప్డ్ స్టోరేజీతో విద్యుదుత్పత్తి అవుతుందన్నారు. దీనిని మీ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు గ్రిడ్‌కు విక్రయించే అవకాశాలున్నాయన్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సక్సెస్ అయింది. రచ్చబండతో పాటు రైతులతో సీఎం ముఖాముఖి నిర్వహించి పంటలను పరిశీలించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పుత్త కృష్ణచైతన్యరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నర్సింహారెడ్డి పాల్గొన్నారు. అనంతరం విమానశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రికి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, డీఐజీ కోయ ప్రవీణ్, జేసీ అదితిసింగ్, ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.మాధవి, వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, వైవీయూ వీసీ రాజశేఖర్, ఎయిర్‌పోర్టు అథారిటీ డైరెక్టరు సుజిత్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, బీటెక్ రవి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, పులివెందుల జడ్పీటీసీ లతా రెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, బి.హరిప్రసాద్, ఎస్.గోవర్ధనరెడ్డి, శ్రవణ్‌రాజ్‌రెడ్డి, సుంకర శ్రీనివాసులు, మన్సూర్ అలీఖాన్ వీడ్కోలు పలికారు.

ప్రత్యేకంగా వేదిక



అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం, రెండో విడత నిధులు జమ చేసే రచ్చబండ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. చిన్నదాసరిపల్లె సమీపంలోని భైరవగుట్ట వద్ద కడప-పులివెందుల ప్రధాన రహదారి పక్కనే వేపచెట్టు కింద పొలంలో రచ్చబండ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వచ్చిన రైతులతో పాటు సీఎం చంద్రబాబు సహా అందరూ మెడలో ఆకుపచ్చ కండువా ధరించారు. నులక పీటలపై రైతులు ఆశీనులయ్యారు. వేదిక ఆవరణలో ట్రాక్టర్లపై వరిగడ్డి, ట్రాక్టర్లు, ఎద్దులు, మేకలు, గొర్రెలు లాంటివి ఏర్పాటు చేసి వేదికను వ్యవసాయం క్షేత్రంలా తీర్చిదిద్దారు.

సీఎం పర్యటన సాగిందిలా..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ రెండో విడత నిధుల కార్యక్రమంలో పాల్గొనేందుకు పెండ్లిమర్రి మండలంలో పర్యటించారు.

- పుట్టపర్తి నుంచి ప్రత్యేక హెలికాప్టరులో సీఎం చంద్రబాబునాయుడు పెండ్లిమర్రిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు మధ్యాహ్నం 2.25 గంటలకు చేరుకున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎమ్మెల్యేలు పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, ఆర్.మాధవి, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, టీడీపీ యువ నాయకుడు శ్రవణ్‌రాజ్, ఆర్డీవోలు జాన్ ఇర్విన్, చిన్నయ్య సీఎంకు స్వాగతం పలికారు.
- 2.35 నిమిషాలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో సీఎం బయల్దేరి పెండ్లిమర్రిలో మన గ్రోమోర్ సెంటరుకు చేరుకుని రైతులతో ముఖాముఖి నిర్వహించారు.
- 2.58 నిమిషాలకు అక్కడి నుంచి బయలుదేరి 3.10 గంటలకు భైరవగుట్ట వద్ద ఏర్పాటు చేసిన రచ్చ బండ వద్దకు చేరుకున్నారు.
- ప్రధాని మోదీ కోయంబత్తూరులో పీఎం కిసాన్‌ను ప్రారంభించగా 3.24 నుంచి 4.13 నిమిషాల వరకు మోదీ ప్రసంగం సాగింది. మోదీ ప్రసంగాన్ని ఎల్‌ఈడీ స్ర్కీన్‌లో సీఎం చంద్రబాబుతో పాటు అందరూ వీక్షించారు.
- 4.20 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం ప్రారంభించి 5.20 గంటలకు ముగించారు. రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.31.35 కోట్లు జమ చేశారు.
- 5.35 గంటలకు పెండ్లిమర్రి మండలంలోని చిన్న దాసరిపల్లెలో వ్యవసాయ క్షేత్రాన్ని రైతులతో కలిసి ట్రాక్టరు మీద పరిశీలనకు వెళ్లారు. వ్యవసాయ క్షేత్రంకు విచ్చేసిన సీఎంకు మహిళా నేతలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ఉద్యాన పంటలను సీఎం పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా జీవ ఎరువులు, పురుగు మందు పిచికారీ చేసే విధానాన్ని అధికారులు సీఎంకు వివరించారు. పంటల సస్యరక్షణ, సాగు విధానంలో పాటించే మెలకువలు, దిగుబడి, మార్కెటింగ్ విధానాలను సీఎం అడిగి తెలుసుకున్నారు.
- 6.30 గంటలకు కార్యకర్తల సమావేశం వేదిక వద్దకు చేరుకున్నారు. కార్యకర్తల మీటింగ్ ముగించుకుని 8.25కు రోడ్డుమార్గాన ఎయిర్‌పోర్టు చేరుకున్న సీఎం 8.50కి ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్లారు.



సైడ్‌లైట్స్

చెన్నూరు/కడప ఎన్టీఆర్ సర్కిల్/ పెండ్లిమర్రి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):

- అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు ఆకుపచ్చ రంగు చొక్కాతో ఉండగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు.
- మధ్యాహ్నం గంటకు పైగా ముఖ్యమంత్రి కోసం రైతులు ఏ మాత్రం విసుగు చెందకుండా ఆనందంగానే గ్యాలరీలో కూర్చుని ఎదురు చూశారు.
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఎటువంటి హంగు ఆర్భాటం లేకుండా చెట్టు కిందనే అరుగుపైన కూర్చోగా, ప్రజలు టెంట్లు, బారికేడ్లు లేకుండా నిరాడంబరంగా కూర్చున్న ముఖ్యమంత్రిని చూసి ఆనందం వ్యక్తం చేశారు.
- కార్యక్రమం ముగిసే వరకూ రైతుల మధ్యనే సీఎం చంద్రబాబు అలాగే కూర్చున్నారు. ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి పేరు పిలవగానే రైతులు కార్యకర్తలు ఈలలు, కేకలు పెట్టారు.
- ఎమ్మెల్యే చైతన్యరెడ్డి సీఎంను ఏపీ సీఎంగా కాకుండా వ్యాపార దిగ్గజం సీఈవోగా పోల్చారు. అలాగే 30ఏళ్ల కుర్రాడిలా సాఫ్ట్‌వేర్ ఇంజనీరులా సీఎం అభివృద్ధిని పరిగెత్తిస్తున్నారని చెప్పడంతో వేదిక హర్షధ్వానాలు మిన్నంటాయి.

అన్నదాత సుఖీభవ మెగా చెక్కు విడుదల

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ మెగా చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం పెండ్లిమర్రి మండలంలోని రచ్చబండలో విడుదల చేశారు. జిల్లాలో 1,94,047 మందికి అన్నదాత సుఖీభవ రూ.97.02 కోట్లు, పీఎం కిసాన్ రూ.34.35 కోట్లు మొత్తం రూ.131.37 కోట్లు లబ్ధి పొందారు.

నియోజవర్గాల వారీగా లబ్ధి మొత్తం రూ.కోట్లలో..

నియోజకవర్గం	రైతుల సంఖ్య	అన్నదాత సుఖీభవ	పీఎం కిసాన్	మొత్తం కోట్లలో..
కమలాపురం	30,700	15.35	5.32	20.67
బద్వేలు	34,148	17.07	6.17	23.25
జమ్మలమడుగు	35,184	17.59	6.22	23.81
కడప	1,576	0.79	0.19	0.98
మైదుకూరు	34,081	17.04	6.15	23.19
ప్రొద్దుటూరు	10,326	5.16	1.85	7.02
పులివెందుల	41,980	20.99	7.32	28.31
రాజంపేట	6,052	3.03	1.12	4.14

భద్రతను పర్యవేక్షించిన కర్నూలు రేంజ్ డీఐజీ



కడప క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు పెండ్లిమర్రి పర్యటన నేపథ్యంలో బుధవారం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్, ఎస్పీ షెల్కే నచికేత్‌విశ్వనాథ్ భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. పోలీసు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. హెలిప్యాడ్, రచ్చబండ వేదిక, పార్కింగ్ తదితర ప్రదేశాలను ఎస్పీ కలియదిరిగి పరిశీలించారు. కాగా..హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబుకు ఎస్పీ స్వాగతం పలికారు.



విమానాశ్రయంలో చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, శ్రవణ్‌రాజ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, భూపేష్‌రెడ్డి, రితేష్‌రెడ్డి


అన్నదాత సుఖీభవ మెగా చెక్కును రైతులకు అందజేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే చైతన్య


వ్యవసాయ క్షేత్రంలో అరటితోటను పరిశీలిస్తున్న సీఎం


రైతు అందజేసిన గొర్రెపిల్లతో చంద్రబాబు

వీకెండ్ పాలిటిక్స్ వద్దు

- ఎమ్మెల్యే వరద మాదిరిగా జనానికి అందుబాటులో ఉండాలి
- టీడీపీ నేతలకు, ఎమ్మెల్యేలకు, ఇన్‌చార్జిలకు చంద్రబాబు క్లాస్
- ప్రోగ్రాం సక్సెస్‌పై కలెక్టర్‌కు చంద్రబాబు ప్రశంస


కడప విమానాశ్రయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

కడప, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీకెండ్ పాలిటిక్స్ వద్దని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో మీరు గెలవాలన్నా, పార్టీ అధికారంలోకి రావాలన్నా నిత్యం జనాల్లో ఉండాలని ఆదేశించారు.

జిల్లాలో కొందరు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు హైదరాబాదులో ఉంటూ వారానికి ఒకసారి వచ్చి పాలిటిక్స్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని బుధవారం ఆంధ్రజ్యోతి ప్రముఖంగా ప్రచురించింది. సీఎం చంద్రబాబు గురువారం పెండ్లిమర్రిలో పర్యటనను ముగించుకుని వెళుతున్న సమయంలో కడప విమానాశ్రయంలో వీడ్కోలు ఇచ్చేందుకు వచ్చిన టీడీపీ నేతలపై ఆయన తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. "ప్రజలకు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలని చెబితే హైదరాబాదు, ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకోండి" అని చంద్రబాబు సీరియస్‌గా హెచ్చరించారు. విమానాశ్రయంలో చంద్రబాబును ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, వరదరాజులరెడ్డి, ఆర్.మాధవి, పుట్టా సూధాకర్‌యాదవ్‌తో పాటు ఇన్‌చార్జిలు రితేశ్‌రెడ్డి, బీటెక్ రవి, భూపేశ్‌రెడ్డి, విజయమ్మ, జిల్లా ఇన్‌చార్జి ఆర్.శ్రీనివాసరెడ్డి కలిశారు. నియోజవర్గాల అభివృద్ధి ఇతర పనులపై సీఎం చంద్రబాబుకు పలువురు వివరించగా.. వారి పనితీరుపై తీవ్రస్థాయిలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటేనే వచ్చే ఎన్నికల్లో గెలుస్తామని చెప్పారు.


పెండ్లిమర్రి మండలం భైరవగుట్టవద్ద ఏర్పాటు చేసిన సీఎం రచ్చబండ కార్యక్రమానికి ఆకుపచ్చ కండువాలతో హాజరైన రైతులు

కలెక్టర్‌కు ప్రశంస

అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ఒక్కరోజు వ్యవధిలో ఏర్పాటు చేయాలని చెబితే తక్కువ సమయంలోనే విజయవంతంగా నిర్వహించడం పై కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ని చంద్రబాబు అభినందినందించినట్లు సమాచారం. ముఖ్యంగా రచ్చబండ వేదికను పూర్తిస్థాయిలో నిర్వహించడం, రైతు జీవితాన్ని ప్రతిబింబించేలా నులక పీటలు, రైతుల మెడలో పచ్చకండువాలు, నులక మంచాలు, ట్రాక్టర్స్‌లో ఎండుగడ్డి, మేకలు, గొర్రెలు, గేదెలు, ట్రాక్టర్లు ఇలా ఎటుచూసినా పల్లె వాతావరణం ఉండేలా ఏర్పాటు చేసిన కలెక్టర్‌ను చంద్రబాబు అభినందించారు.

సర్వరాయసాగర్ కాల్వలు పూర్తిచేయండి

- ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే వినతి


సీఎం చంద్రబాబునాయుడుకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి, పుత్తా నరసింహారెడ్డి తదితరులు

కడప ఎన్టీఆర్ సర్కిల్ / చెన్నూరు / పెండ్లిమర్రి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సర్వరాయసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కాల్వలను పూర్తిచేసి 32వేల ఎకరాల ఆయకట్టుకు నీరందేందుకు సహకరించాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. పెండ్లిమర్రి మండలంలో బుధ వారం నిర్వహించిన రచ్చబండ కార్యక్ర మానికి హాజరైన సీఎం చంద్రబాబు కు ఎమ్మెల్యే నియోజకవర్గంలోని పలు సమ స్యలపై విన్నవించారు. 2012లో గాలేరు నగరి, సుజల స్రవంతి పూర్తిచేయాలనే డిమాండ్‌తో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తన తండ్రి పుత్తా నరసింహారెడ్డి పాదయాత్ర చేశారన్నారు. ఈ కార్యక్రమానికి అప్పట్లో అచ్చెన్నాయుడు హాజరై ప్రాజెక్టును పూర్తి చేసేందుకు హామీ ఇచ్చారన్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ప్రాజెక్టులో భాగంగా సర్వరాయసాగర్‌ను పూర్తిచేశారన్నారు. దీని కాల్వల పూర్తికి సహకరించాలన్నారు. ఇటీవల కడపలో నిర్వహించిన మహానాడులో గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని ఇందుకనుగుణంగా పనులు మొదలుపెట్టడం సంతోషించదగ్గ విషయమన్నారు. కమలాపురంలో ప్రజలు రైల్వేగేటు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని దానిని నివారించేందుకు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు. కమలాపురం పట్టణాన్ని నగర పంచాయతీగా చేశారని, తిరిగి దానిని పంచాయతీగా చేయాలని విన్నవించారు. కమలాపురం నియోజకవర్గంలోని నాలుగు డివిజన్లు కడప నగరంలో విలీనం అయ్యాయన్నారు. వాటి అభివృద్ధికి తగినన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం సీఎం చంద్రబాబునాయుడకు గౌరవ పూర్వకంగా జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్, కలెక్టరు శ్రీధర్ చెరుకూరి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత కాలనీల్లో ఆలయాల నిర్మాణం

దేవదాయ శాఖ జిల్లా అధికారి విశ్వనాథం


రామాలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న దేవదాయ శాఖాధికారులు

గాలివీడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో శ్రీవాణి ట్రస్టు ద్వారా దళితవాడలు, బీసీ కాలనీల్లో ఆలయాల నిర్మాణం చేపడుతున్నట్లు జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథం తెలిపారు. బుధవారం పూలుకుంట గ్రామం మంగళపల్లి, రెడ్డివారిపల్లె, వడ్డెపల్లెల్లో దేవాలయాల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆలయాల నిర్మాణం కోసం దరఖాస్తు చేసిన గ్రామాల్లో మొదటి దశలో స్థలాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. స్థలాల పరిశీలన అనంతరం దేవాలయాల నిర్మాణం కోసం వాటి మంజూరు కొరకు దేవదాయ శాఖ కమిషనర్‌కు నివేదికలను పంపుతామన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏఈ రవితేజ, సర్పంచ్ పార్థసారధిరెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్ అర్జీలను పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు


రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని డీఆర్‌వో మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా రెవెన్యూ శాఖ అర్జీలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, పట్టాదారు పాస్‌పుస్తకాలు, మ్యుటేషన్ సేవలు పారదర్శకంగా అందించడంతో పాటు వీటిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఫ్లోచార్ట్‌ల ప్రకారం దరఖాస్తుల ప్రక్రియ గ్రామ సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్ల నుంచి ప్రారంభమయ్యేలా మండలాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ రెడ్డెన్న, ఎంఆర్ఐ రాజేశ్, వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సౌమ్యనాథస్వామి సన్నిధిలో ఏపీజీబీ చైర్మన్


ఏపీజీబీ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

నందలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నందలూరు సౌమ్యనాథస్వామిని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీజీబీ రీజనల్ మేనేజర్ సుశాంత్‌కుమార్ స్వారో, నందలూరు బ్యాంకు మేనేజర్ కల్యాణి, ఫీల్డ్ ఆఫీసర్ జాహ్నవిదర్, సౌమ్యనాథసేవా ట్రస్టు కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, అన్నదాన ట్రస్టు సభ్యుడు చక్రాల సాయినాథ్‌కుమార్, శ్రీనివాసులు, శివయ్య, వరదయ్య పాల్గొన్నారు.

మద్దయ్యగారిపల్లెలో గొర్రెల దొంగలు

పెద్దతిప్పసముద్రం నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓ దొంగల ముఠా సినీ ఫక్కీలో బొలెరో వాహనంలో వచ్చి గొర్రెలను తీసుకెళ్లిపోయారు. గ్రామస్థులు అందించిన వివరాల మేరకు మద్దయ్యగారిపల్లె వాసి కొత్తోళ్ల ఆదినారాయణ గొర్రెలు మేపుతూ జీవనం సాగించేవాడు. మంగళవారం సాయంత్రం గొర్రెలను తమ ఇంటి పక్కనే గొర్రెల దొడ్డికి తోలి ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గొర్రెల దొడ్డిలో అలజడి కావడంతో అక్కడికి వెళ్లి చూడగా బొలేరో వాహనంలో వచ్చిన కొందరు దొంగలు గొర్రెల మందలోని నాలుగు గొర్రెలను వాహనంలో ఎక్కించేశారు. ఆదినారాయణ గట్టిగా కేకలు వేసి పరుగున వాహనం వద్దకు వెళ్లడంతో ఒక్కసారిగా వాహనాన్ని అక్కడి నుంచి వేగంగా పోనివ్వడంతో అందులోంచి ఒక్క గొర్రె కిందికి దూకేసింది. మిగిలిన మూడు గొర్రెలతో దొంగలు ఉడాయించారు. నిత్యం రద్దీగా ఉండే మద్దయ్యగారిపల్లెలో ఇలాంటి సంఘటనలు జరగడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీసులు గ్రామాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గుర్రంకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నడుస్తూ వెళుతున్న క్రిష్టప్ప((72)ను టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... గుర్రంకొండ పట్టణం రామకృష్ణారెడ్డినగర్ వాసి క్రిష్టప్ప ఇంటి నుంచి బస్టాండుకు నడుచుకుంటూ వెళుతుండగా చెర్లోపల్లె నుంచి గుర్రంకొండకు వస్తున్న టాటా ఏస్ వాహనం ఎస్‌బీఐ సమీపంలో వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో బాధితుడి తలకు తీవ్ర గాయం కావడంతో 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తీసుకెళుతుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మహబూబ్‌బాషా (ఫైల్)

మదనపల్లె అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహబూబ్ బాషా (35) అనే వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె పట్టణం చీకటిగుట్ట వాసి మహబూబ్ బాషా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం తన భార్య చోటి జాన్ గొడవపడడంతో మనస్థాపానికి గురై రాత్రి ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

బుధవారం ఉదయం భార్య నిద్రలేచి చూడగా శవమై కనిపించాడు. వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. టూటౌన్ సీఐ రాజారెడ్డి ఆత్మహత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మూన్నాళ్ల ముచ్చటేనా...!

- **పాడైపోయిన డైట్ పార్కు**
- **చిన్నపాటి వర్షానికే కొట్టుకుపోయిన గ్రావెల్**
- **రూ.కోట్లు పెట్టి కట్టి గాలికి వదిలేశారు**
- **పట్టించుకోని మున్సిపల్ అధికారులు**


డైట్ మున్సిపల్ పార్కు

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదకరమైన వాతావరణంలో వాకింగ్ చేస్తూ ఆనందంగా గడుపుతున్న రాయచోటి వాసులకు ఇటీవల వచ్చిన వర్షం పుణ్యమా అని ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల డైట్ పార్క్ పాడైపోయింది. పార్కు ఏర్పాటు చేసినప్పుడు ఇక్కడి ప్రజలు ఎంతో ఆనందపడ్డారు. ఐదు సంవత్సరాల చిన్నపిల్లవాడి దగ్గర నుంచి 75 ఏళ్ల వృద్ధుడి వరకు దాదాపు అందరూ పార్కులో ఉదయం, సాయంత్రం మంచి వాతావరణలో వాకింగ్ చేస్తూ ఆనందంగా గడిపేవారు. అయితే ఈ ఆహ్లాదరకమైన వాతావరణం డైట్ పార్కులో మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. రెండు వారాల క్రితం పడిన వర్షానికి ట్రాక్ మీద వేసిన గ్రావెల్ మొత్తం కొట్టుకుపోయి లైటింగ్ మొత్తం పాడైపోయి ఎక్కడికక్కడ చెట్లు విరిగిన పరిస్థితి డైట్ పార్కులో దర్శనమిస్తోంది. దాదాపు కోటి 53 లక్షలతో లక్షలతో నిర్మించిన ఈ పార్కు ఒకప్పుడు డైట్ హాస్టల్ ప్రాంగణంగా ఉండేది. అంతేగాక ఈ పార్కులో వేసిన ట్రాక్ పక్కన ఉన్న షెల్టర్ల కింద కొంతమంది మద్యం తాగి ఎక్కడపడితే అక్కడ బాటిళ్లు పారవేస్తున్నారు. దీనివల్ల పార్కుకు రావడానికి మహిళలు భయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఈ పార్కుపై దృష్టి పెట్టి ఈ పార్కులో మంచి వాతావరణం ఉండేటట్లు చూస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ రవిని వివరణ కోరగా నేను వచ్చిన తర్వాత రెండు సార్లు డైట్ పార్కును సందర్శించాను. అక్కడే చిన్న చిన్న సమస్యలు ఉన్నది వాస్తవమే. పార్కులో ఏమేమి అవసరమో నేను వెళ్లి ఒకసారి చూసి తర్వాత చర్యలు తీసుకుంటాం.


పార్కులో ఏర్పాటు చేసిన లైటింగ్ బోర్డు పగలగొట్టిన దృశ్యం


నడక దారిలో పైకి తేలిన రాళ్లు

పట్టించుకునే వారే లేరు



పార్కు ఏర్పాటు చేసిన కొత్తలో కొంత బాగానే ఉండేది. అప్పుడు ఉదయం, సాయంత్రం పోలీసు వారు కూడా పర్యవేక్షిస్తూ ఉండేవారు. కొంతకాలంగా ఈ పార్కును మున్సిపల్ అధికారులు కూడా పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. ఈ మధ్య కురిసిన వర్షాలకు పార్కు మొత్తం పాడైపోయి గ్రావెల్ కొట్టుకుపోయి రాళ్లు బయటప డ్డాయి. వ్యాయామం చేసే పరికరాలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. లైటింగ్ కూడా అంతంత మాత్రమే ఉంది. ఉదయం, సాయంత్రం మహిళలు ఈ పార్కులో వాకింగ్ చేయడానికి భయపడుతున్నారు. ఆకతాయిలు ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పార్కులో ఉండి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ పార్కుపై దృష్టి పెట్టి అసాంఘీక వ్యక్తులను రానివ్వకుండా ఉంటే బాగుంటుంది.

-పురుం రెడ్డెయ్య, రాయచోటి

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- **ప్రతి ఒక్కరి పనితీరు నివేదిక నా దగ్గర ఉంది**
- **కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు**

(కడప - ఆంధ్రజ్యోతి): మళ్లీ మనం గెలవాలన్నా మనం.. అధికారంలోకి రావాలన్నా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు నిత్యం ప్రజల్లో ఉండాలి. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కార్యకర్తల సమస్యలను సావధానంగా వినాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. బుధవారం సాయంత్రం పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరులో కమలాపురం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు కొంతమంది ఎమ్మెల్యేల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతి నెలా పింఛను పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాల్గొనాలని, నేను ఏదో ఒక జిల్లాలో ప్రతి నెలా పాల్గొంటున్నాని, ప్రతి సోమవారం పార్టీ ఆఫీసుకు వెళ్లి పార్టీని మరింత పటిష్టం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎవరెవరు పనిచేస్తున్నారో అందరి పనితీరు జాబితా నా వద్ద ఉందని, మైనార్టీల్లో మనకు ఓటింగ్ బాగా పెరిగిందని, తల్లికి వందనం పథకం మంచి మేలు చేసిందని, ఉచిత బస్సుతో పార్టీ పట్ల మహిళల ఆదరణ బాగుందని తెలిపారు. అందుకే ప్రజలతో మమేకం కావాలని, ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పుత్తా చైతన్యరెడ్డి బాగా కష్టపడుతున్నారని, మంచి పేరుందని, అయితే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రాధాన్యతాపరంగా నిధులు విడుదల చేస్తానని వెల్లడించారు. ఈనెల చివరి నాటికి క్లస్టర్ మండల పదవులు భర్తీ చేస్తామని, ఎన్నికల్లో బద్వేలు, పులివెందుల గెలవలేకపోయామని, ఈసారి అక్కడ ప్రత్యేక దృష్టి పెట్టి అక్కడ గెలిచేందుకు గట్టిగా కృషి చేస్తామని తెలిపారు. కమలాపురం నియోజకవర్గానికి రాష్ట్రస్థాయి పదవులు రెండు మాత్రమే వచ్చాయని, మరిన్ని పదవులు కావాలని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఇంకా పలు సమస్యలను ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లారు.


పెండ్లిమర్రిలో మన గ్రోమోర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు


టమోటా తోట వద్ద మహిళలతో మాట్లాడుతున్న చంద్రబాబు


డ్రోన్‌తో మందుల పిచికారీని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి


డ్రిప్‌ను పరిశీలిస్తూ...


పెండ్లిమర్రిలో మంత్రి అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

శివాలయంలో ఘనంగా లక్ష బిల్వార్చన


లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న అర్చకులు


వెండి ముఖావాడ, నాగాభరణంతో దర్శనం ఇస్తున్న నరసింహస్వామి

పెద్దతిప్పసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కార్తీకమాసం చివరి రోజున ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు బెంగళూరుకు చెందిన వేదపండితులచే లక్ష బిల్వార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు లండన్‌లో ఉన్న ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య కుమారుడు సనగరం లక్ష్మీనరసింహశర్మ, సాయికృష్ణ, శ్వేత దంపతులు ఆలయానికి రూ.6 లక్షల విలువైన వెండి ముఖావాడ, వెండి నాగాభరణములను ఆలయానికి బహూకరించారు. వారు అందించిన ముఖావాడ, నాగాభరణాలకు వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారికి అలంకరించారు. కార్తీకమాసం చివరి రోజు కావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం


ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని గ్రీన్‌వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 69వ రాష్ట్ర స్థాయి అండర్-14 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీలను బుధవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు పోటీల్లో మంచి ప్రతిభ కనబరచాలని తెలిపారు.

ఇక్కడే కాకుండా చంద్రమాకులపల్లె జడ్పీ హైస్కూల్‌లో కూడా పోటీలు జరుగుతాయని నిర్వాహకులు డాక్టర్ ఎస్.బాబు, నాగరాజా, మురళీధర్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో సుమారు 450 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, ఇందులో ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని పరిశీలకులు తెలిపారు. కార్యక్రమంలో చంద్రమాకులపల్లె హెచ్‌ఎం, గ్రీన్‌వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ రంగారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోల జిల్లా నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

రాయచోటిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేసే డిప్యూటీ ఎంపీడీవోల జిల్లా నూతన కమిటీని బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 30 మండలాలకు చెందిన డిప్యూటీ ఎంపీడీవోలు సమావేశానికి హాజరై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా టి.సురేశ్‌బాబు (రాయచోటి డిప్యూటీ ఎంపీడీవో), జనరల్ సెక్రటరీగా సి.రాంమోహన్‌రెడ్డి (ఓబులవారిపల్లె డిప్యూటీ ఎంపీడీవో), ట్రెజరర్‌గా టి.భారతి (మదనపల్లె డిప్యూటీ ఎంపీడీవో), వైస్ ప్రెసిడెంట్‌గా సి.అష్రఫ్‌వలి (రాజంపేట, డిప్యూటీ ఎంపీడీవో)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు హాల్‌టిక్కెట్లు

రాజంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం నారంరాజుపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే ఏడాది ఆరో తరగతిలో ప్రవేశానికి డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఇందుకు సంబంధించిన హాల్‌టిక్కెట్లను కూడా విడుదల చేశామని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కె.గంగాధరన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

బాలికల సంరక్షణ మనందరి బాధ్యత


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలికల చదువు, బాలికల సంరక్షణ మనందరి బాధ్యత అని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిక అధికారి హైమావతి తెలిపారు. బుధవారం చెన్నముక్కపల్లె, సుండుపల్లె రోడ్డు నారాయణ ఫంక్షన్ హాల్‌లో భేటీ బచావో, భేటీ పఢావో పథకంపై గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు జిల్లా స్థాయి ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకంపై గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో ఆడ, మగ సమానత్వం అనేది మన ఇంటి నుంచే మొదలు పెట్టాలని, అప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ఆడపిల్లల మీద ఉన్న అపోహలను తొలగించేందుకు అవగాహన కార్యక్రమాలను చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రెజరీ ఏటీవో జయలక్ష్మి, జీఎస్‌డబ్ల్యుఎస్ డిపార్టుమెంట్ డీడీవో లక్ష్మీపతి, సీడీపీవో శశికళ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి వినోద్‌కుమార్, సూపర్‌వైజర్లు, మహిళా కార్యదర్శి జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది, శిశు గృహ సిబ్బంది, వన్‌స్టాప్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్టీపీపీకి ఎమ్మెల్యేల కమిటీ


ఎర్రగుంట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షతన ఏర్పాటైన పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ గురువారం ఆర్టీపీపీకి వస్తోంది. బుధవారం రాత్రి విజయవాడలో ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి గురువారం తెల్లవారుజామున ప్రొద్దుటూరులో దిగి రాయల్‌కౌంటిలో విశ్రాంతి తీసుకుంటారు. ఉదయం 11గంటలకు ఆర్టీపీపీకి వస్తారు. ప్లాంటులో పర్యటిస్తారు. అనంతరం ఆర్టీపీపీ అధికారులతో సమావేశం అవుతారు. 12 మంది ఎమ్మెల్యేలతో కూడిన ఈ కమిటీ ఆర్టీపీపీ గురించి రివ్యూ చేస్తారు. ఇందు కు సంబంధించి ఆర్టీపీపీ సీఈ వాసు దేవరావు ఆధ్వర్యంలో కమిటీకి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం అనంతరం వారు గండికోటకు బయలు దేరి వెళతారని, అక్కడి నుంచి కడపకు వెళ్లి అక్కడ జరిగే రివ్యూల్లో పాల్గొంటారు.

మనసు పరవశించచనే...

- కనువిందు చేస్తున్న జలసవ్వడులు
- గంగ ఎస్ఆర్-1 పరిసరాలు ఆహ్లాదం


పాల నురుగలా జాలువారుతున్న గంగ నీటి ప్రవాహం

దువ్వూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె వద్ద ఉన్న తెలుగుగంగ సబ్సిడరీ-1 పరిసరాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడ తెలుగుగంగ ప్రధాన కాలువ ద్వారా రిజర్వాయర్-1లోకి నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం నిండుకుండలా దర్శనమిస్తున్న రిజర్వాయర్ చూపరులకు ముచ్చట గొలిపిస్తోంది. హెడ్ రెగ్యులేటర్ ద్వారా దిగువనున్న చెన్నముక్కపల్లె కాలువకు నీరు వెళుతున్న దృశ్యాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ఎడమవైపు నుంచి నీరు వెళుతూ చెన్నముక్కపల్లె కాలువలోకి దూకే సమయంలో నురగలు కక్కుతూ ముచ్చట గొలుపుతున్నాయి. కుడివైపునున్న రంధ్రం నుంచి జాలువారుతున్న జలాలు ఆకర్షిస్తున్నాయి. ఇక్కడే హండా నిధులతో పార్కును ఏర్పాటు చేశారు. అందులో పర్యాటకులు సేదతీరుతూ కాలక్షేపం చేస్తుంటారు. ఆదివారం ఆటవిడుపుగా ఇక్కడకు జనాలు వస్తుంటారు. ఈ ప్రాంతంలో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రిజర్వాయర్‌లోకి దిగవద్దని బోర్డులు రాసి ఉంచారు. ఈ తరహా నిబంధనలు పర్యాటకులు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హెడ్‌రెగ్యులేటర్‌కు కొంత ముందుకెళుతూ కుడివైపున గోశాల ఏర్పాటు చేశారు. ఇందులో ఆవులను పెంచుతూ సంరక్షిస్తున్నారు.


హెడ్ రెగ్యులేటర్ సొరంగం నుంచి కిందకు దూకుతున్న గంగ జలాలు

ప్రొద్దుటూరు పురపాలక సంఘము

నోటిఫికేషన్

(Under Rule 169(1) Sub rule 3(c) of Go.Ms.No.04 MA&UD, Dt.09.01.2025)

ప్రొద్దుటూరు పట్టణ ప్రజలకు తెలియజేయడం ఏమనగా, ఈ క్రింద కనబరచిన వివరముల మేరకు కొర్రపాడు రోడ్డు (రాజీవ్ సర్కిల్ నుండి R & B బంగ్లా) వరకు ప్రతిపాదిత 100' అడుగుల వెడల్పు గల మాస్టర్ ప్లాన్ రోడ్డు నందు స్థలం కోల్పోతున్నందున పరిహారముగా TDR బాండ్స్ జారీ చేయుటకు కమీషనర్ ప్రొద్దుటూరు పురపాలక సంఘము వారికి అంగీకారం తెలుపుతూ స్థల యజమానులు లేఖలు సమర్పించియున్నారు.

S. No.	Name of the Owner	Sy.No. & Revenue Village	Door No.	Extent affected in Road Widening in Sq.mts.
1	G.Venkata Lakshumma	631 of Proddatur	7/1329-1, G+2 Building	92.34
2	G. Veera Ramesh Reddy	635 of Proddatur	7/1286 Ground floor Building	115.39
3	V S Manohar & Others M/S Nanda Cotton Ginning industries	629,630,631 of Proddatur	7/1392 to 7/1394 Ground floor	495.02
4	M Rina President DAW College Committee	667/A of Proddatur	Vacant land abutting Korrapadu Road	780.72
5	G. Venkata Ramanaiah	635 of Proddatur	7/1228, Ground Floor	131.38
6	G Nirupama	631 of Proddatur	7/1386, G+1 building	32.81
7	B. Venkata Subba Raja Guptha.B Surendra Guptha	631 of Proddatur	7/1386, G+1 building	32.81

కావున పైన పేర్కొన్న స్థల యాజమాన్యం / హక్కులకు అంశమునకు సంబంధించి ప్రొద్దుటూరు పట్టణ ప్రజలకు ఏమైనా అభ్యంతరములు ఉన్నచో ఈ కార్యాలయమునకు 7 రోజుల లోపు కార్యాలయ పనివేళలలో స్వయముగా వచ్చి సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరడమైనది. ఎటువంటి అభ్యంతరములు రాని యెడల పై వాటిపై ఎటువంటి అభ్యంతరం లేదు అని భావించి సదరు యజమానులకు ప్రొద్దుటూరు పురపాలక సంఘము ద్వారా TDR బాండ్స్ జారీ చేయబడునని తెలియజేయడమైనది.

(mpl.proddatur@gmail.com) సం/- కమీషనర్
చిరునామా: ప్రొద్దుటూరు పురపాలక సంఘము — ప్రొద్దుటూరు పురపాలక సంఘము

ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలి

- జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ యామిని

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆమె జాతీయ లోక్ అదాలత్ ముందస్తు సమావేశం వర్చువల్‌గా నిర్వహించారు. డిసెంబరు 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి వీలున్న కేసులపై ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, న్యాయవాదులు, పిటీషనర్ ఎంవీఓపీ అడ్వకేట్లు, చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులతో చర్చించారు. కార్యక్రమంలో రాజంపేట మూడవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్, కడప నాల్గవ అదనపు జిల్లా జడ్జి జి.దీనాబాబు, ఏడవ అదనపు జిల్లా జడ్జి జి.రమేష్‌కుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి : వీసీ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ సూచించారు. నెట్, జేఆర్ఎఫ్ అర్హత సాధించిన విద్యార్థులకు దేశంలో మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో యూజీసీ నెట్, ఏపీసెట్, సీఎస్ఐఆర్, నెట్ కోచింగ్ తరగతులను ప్రారంభించారు. ఈ కోచింగ్ ద్వారా పేపర్-1 పూర్తి సిలబస్‌ను నిపుణులైన అధ్యాపకులు బోధించనున్నారు. అలాగే విద్యార్థుల సందేహాలను తీర్చడానికి ప్రత్యేక డౌట్- క్లారిఫికేషన్ సెషన్లు కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఈ కోచింగ్ ఎంతో ప్రయోజనకరమన్నారు. నెట్, జేఆర్ఎఫ్ అర్హత సాధించిన వారికి దేశవ్యాప్తంగా మంచి అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా జేఆర్ఎఫ్ ద్వారా 60 నెలల పాటు నెలకు రూ.40వేల చొప్పున మొత్తం రూ.24లక్షల వరకు ఆర్థిక ప్రయోజనం పొందవచ్చన్నారు. ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.విజయభారతి మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రఘునాథరెడ్డి, రఘునాథరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సతీష్ బాబు, ఈశ్వర్‌రెడ్డి, జయంత్ కశ్యప్, పరిశోధక, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

సోది కాదు... సూది నారాయణరెడ్డిని


జమ్మలమడుగులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది

జమ్మలమడుగు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎంపీ అవినాశ్‌రెడ్డి తనను సోది నారాయణరెడ్డి అని అహంకారంతో మాట్లాడారని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. ఇక నుంచి తాను సోది కాదని, సూది నారాయణరెడ్డి అని మీ అవినీతిని ఎప్పుడూ గుచ్చుతూనే ఉంటానన్నారు. బుధవారం సాయంత్రం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, రైతుల సమావేశం అనంతరం బయట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ తాను జమ్మలమడుగులో వైసీపీ అభ్యర్థి సుధీర్‌రెడ్డిని ఓడించానన్నారు. ప్రతిపక్షంలో ఉండాల్సిన జగన్ మోహన్‌రెడ్డి ప్రతి నాయకుడిగా మారినా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. పులివెందుల ప్రజలు సున్నితమైనవారని వారిని మభ్యపెట్టి మీరు రాజకీయం పబ్బం గడుపుకుంటున్నారని చీనీలో, అరటిలో దోపిడీ చేస్తున్నారని అవినాశ్‌రెడ్డిని విమర్శించారు. వైఎస్ భారతి 400 కేజీల బంగారం కొన్నది వాస్తవం కాదా అన్నారు.

పర్వతారోహణ క్యాంప్‌నకు వైవీయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు


పర్వతారోహణ క్యాంప్‌నకు బయలుదేరిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ పరిధిలోని జాతీయ సేవా పథకం వలంటీర్లు హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలి పర్వతారోహణ క్యాంప్‌నకు బుధవారం బయలు దేరివెళ్లారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి కడప రైల్వేస్టేషన్‌కి వెళ్లి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అడ్వెంచర్ క్యాంప్‌లో అద్వితీయమైన పాత్రను పోషించి విద్యాలయానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ పర్వతారోహణ క్యాంప్‌నకు కంటింజెంట్ లీడర్‌గా యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.లలిత వ్యవహరిస్తున్నారు. వైవీయూ పీజీ కళాశాల, పులివెందుల ప్రభుత్వ మహిళా కళాశాల, కడప ఆర్ట్స్ కళాశాల, ఎస్‌కేఆర్అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీహరి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పది మంది బయలుదేరి వెళ్లారు. పదిరోజుల పాటు జరిగే అడ్వెంచర్ క్యాంప్‌లో వీరి సాహసాలను ప్రదర్శించనున్నారు.

సహకార రంగంలో టౌన్‌బ్యాంక్‌కు ప్రత్యేక స్థానం

- జిల్లా సహకారశాఖ అధికారి వెంకటసుబ్బయ్య



చెక్కును అందజేస్తున్న జిల్లా సహకారశాఖ అధికారి వెంకటసుబ్బయ్య

ప్రొద్దుటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సహకార రంగంలో ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకుకు ప్రత్యేక స్థానం దక్కుతుందని జిల్లా సహకారశాఖ అధికారి వెంకటసుబ్బయ్య కొనియాడారు. బుధవారం 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను స్థానిక కోనేటి కాల్వ వీధిలోని ప్రొద్దుటూరు టౌన్ బ్యాంక్‌లో ఘనంగా నిర్వహించారు. బ్యాంకు ఛైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి సహకారశాఖ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సహకార వ్యవస్థ సమిష్టి ప్రయోజనాలను నెరవేర్చు తుందన్నారు. ముఖ్యంగా పేద మధ్య తరగతికి చెందిన వారికి సహకార రంగం ఎంతో తోడ్పాటును అందిస్తుందన్నారు. ఛైర్మన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ టౌన్ బ్యాంకు అధికారులు, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, ఖాతాదారుల సంపూర్ణ సహకారంతోనే బ్యాంకు లాభాల బాటలో పయనిస్తోందన్నారు. ఈసందర్భంగా పలువురు బ్యాంకు ఖాతాదారులకు రుణాలు అందజేశారు. కార్యక్రమంలో డివిజనల్ సహకారశాఖ అధికారి సత్యానంద, జిల్లా సహకారశాఖ ఆడిట్ అధికారి బ్రహ్మానందరెడ్డి, ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, బ్యాంకు సీఈవో నిరంజన్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ మహ్మద్‌గౌస్, బ్యాంకు డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆర్టీపీపీ పైపులైన్‌కు లీకేజీలు


వృద్ధాశ్రమం వద్ద గుంతలో నిలబడిన నీరు

చాపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ నుంచి ఆర్టీపీపీ థర్మల్ ప్రాజెక్టుకు వెళ్లే పైపులైనుకు లీకేజీలు ఏర్పడ్డాయి. చాపాడు గ్రామంలోని దిలీప్ గ్యాస్ గోడౌన్ వద్ద, కాశిరెడ్డినాయన వృద్ధాశ్రమం సమీపంలో లీకేజీ కావడంతో నీళ్లు వృథాగా పోతున్నాయి. బయటకు వస్తున్నాయి. దీంతో వృద్ధాశ్రమంలో నీరు నిలబడి వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం లీకేజీలను అరికట్టేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ పాయింట్లను గుర్తించలేకపోయారు. దీంతో నీరు వృథాగా పోతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఇంజనీర్లు లీకేజీలను గుర్తించి అరికట్టాల్సిన అవసరం ఉంది.

యాంటీబయాటిక్స్ అతిగా వాడితే ప్రమాదకరం



మాట్లాడుతున్న పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పశువుల చికిత్సలో యాంటీబయాటిక్స్‌ను ఎక్కువగా వాడరాదని, డాక్టర్ల సూచనల మేరకే ఉపయోగించాలని శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో వరల్డ్ ఎఎంఆర్ అవర్నెస్ వీక్‌లో భాగంగా ఐసీఏఆర్ ప్రాజెక్టు ద్వారా పశువులు, చేపలలో యాంటీ మైక్రోబియాల్ రెసిస్టెంట్స్ గురించి వర్తమానాన్ని కాపాడుతూ భవిష్యత్తును భద్రంగా చూసుకునే స్కీంతో సెమినార్ నిర్వహించారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ గన్నవరం పశువైద్య కళాశాల వైద్యుడు డాక్టర్ ఆనందప్రసాద్, పశువైద్యులు, విద్యార్థులకు యాంటీ మైక్రోబియాల్ రెసిస్టెంట్స్ గురించి, దాని వలన కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. యాంటీ బయాటిక్స్ వాడకం వలన మనుషులు, మొక్కలు, ప్రకృతి ఆరోగ్యం ఏ విధంగా దెబ్బతింటుందో వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్యులు మూగజీవాలకు వైద్యం చేసేటప్పుడు యాంటిబయాటిక్స్‌ను తగిన మోతాదులో వాడాలని సూచించారు. అతిగా వాడటం వలన దుష్పరిణామాలకు దారి తీస్తుందన్నారు. కళాశాల ఏఎస్‌వో డాక్టర్ రాజాకిశోర్, సూక్ష్మశాస్త్ర విభాగం ప్రొఫెసర్ విజయలక్ష్మిలు యాంటీబయాటిక్స్ విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోస్టర్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి


వెంకటరామయ్య (ఫైల్)

మైదుకూరు నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వని పెంట గ్రామం లెక్కలవారిపల్లె వెళ్లే రోడ్డులో బుధవారం సాయం త్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముక్కమల్ల వెంకటరామయ్య (66) అనే వ్యక్తి మృతి చెందాడు. అక్కులాయపల్లెకు చెందిన వెంకట రామయ్య తమ సమీప బంధువు అనారోగ్యంతో ఉంటే పరామర్శించేందు కు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో మైదుకూరుకు చెందిన ఓ కాలేజీ బస్సు అతన్ని వెనక వైపు నుంచి ఢీకొంది. దీంతో తలకు తీవ్రగాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. కూలీ, బేల్దారి పనులు చేసుకొని జీవనం సాగించే వెంకటరామయ్యకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తెకు భర్త మరణించడంతో ఆమెను, ఆమె పిల్లలను ఈయనే పోషించేవారు. అకస్మాత్తుగా కుటుంబ పెద్ద మృత్యువాత పడడంతో భార్య పిల్లలు అనాథలయ్యారు. మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పీఎం కిసాన్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

సీకేదిన్నె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేవీకే సమన్వయకర్త అంకయ్యకుమార్ అన్నారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం 21వ విడత ప్రధానమంత్రి కిసాన్ సన్మాన్ నిధి ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమాన్ని రైతులతో ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, ఆత్మా పీడీ విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక స్థితిని బలోపేతంచేయడమే మోదీలక్ష్యం

పులివెందుల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడమే కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం కిసాన్ నిధుల విడుదల దేశవ్యాప్తంగా 11కోట్లకు పైగా రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. ఈ విడత కింద ప్రతి అర్హులైన రైతుకు రూ.2వేల చొప్పున నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. పీఎం కిసాన్ యోజన ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.3.70లక్షలకోట్లకు పైగా నిధులు నేరుగా జమచేశారన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం ప్రభుత్వం జూనియర్‌కళాశాలలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నగర నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరుకున్న దీక్షలు



రిలే నిరాహారదీక్షలో ఎన్ఎంయూఏ ప్రతినిధులు

కడప మారుతీనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయుఏ) రీజియన్ కమిటీ ఆధ్వర్యంలో కడప ఆర్ఎం కార్యాలయం ఎదుట తలపెట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలు బుధవారంనాటికి రెండో రోజు చేరుకున్నాయి. నిరాహార దీక్షల్లో శివయ్య, పీయుఎం రెడ్డి,ఎల్ఎంరావు, జీఎస్‌కుమార్,రవీంద్ర కూర్చున్నారు. కార్యక్రమంలో పలువురు ఎన్ఎంయుఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

కంటి పరీక్ష శిబిరం విజయవంతం



లింగాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామసముద్రం గ్రామంలో బుధవారం నిర్వహించిన కంటి పరీక్ష శిబిరం విజయవంతం అయింది. స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో పులివెందుల రాజారెడ్డి వైద్యశాల ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్య విజ్ఞాన సంస్థ వారు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. మొత్తం 50 మందికి పరీక్షలు నిర్వహించగా 20మందికి ఆపరేషన్ అవసరం కావడంతో వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. సర్పంచు వెంకటనారాయణరెడ్డి, జయరామిరెడ్డి, ఎల్వీ ప్రసాద్ సంస్థ మేనేజర్ కోటిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులపై చిన్నచూపు..!

ఆరేళ్లుగా సబ్బులు, తలనూనెకు నోచుకోని పారిశుధ్యకార్మికులు

పులివెందుల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెల్లవారుజాము నుంచి పట్టణాన్ని శుభ్రం చేసేందుకు బయలుదేరే పారిశుధ్య కార్మికులు ఆరేళ్లుగా సాధారణ సదుపాయాలకు కూడా నోచుకోవడం లేదు. నిబంధనల ప్రకారం పారిశుధ్య కార్మికులకు దక్కాల్సినవి అందడం లేదు. ఎప్పటికప్పుడు ప్రజారోగ్యాన్ని కాపాడడంలో రక్షణకవచంలా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చనిపోయిన జంతువుల కళేబరాలను ఎత్తివేస్తూ, మురుగును తొలగిస్తూ, మ్యాన్‌హోల్ నిండితే మురికినీటిని ఎత్తివేసి అందులోకి దిగి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తుంటారు. ఈ సమయంలో బూట్లు, గ్లౌజులు, చేతులు శుభ్రం చేసుకునేందుకు సబ్బులు అందుబాటులో ఉండాలి. పారిశుధ్య పనులు చేసే సమయంలో గాలి, దుమ్ము, ధూళి కారణంగా తలవెంట్రుకలు పాడుకాకుండా, చుండ్రు రాకుండా తలనూనె అందుబాటులో ఉండాలి. ఈ విషయాన్ని మున్సిపాలిటీపాలక వర్గం, మున్సిపాలిటీ అధికారవర్గం విస్మరించారని స్పష్టమవుతోంది. వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలను తొలగించే పారిశుధ్య కార్మికులపై నిర్లక్ష్యభావం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆరేళ్లుగా సబ్బులు లేవు, తలనూనెలు లేవు..: పారిశుధ్య కార్మికులకు గతంలో ఏడాదికి సరిపడా సబ్బులు, తలనూనెలు ఇచ్చేవారు. ఆ తర్వాత మున్సిపాలిటీ ఏకపక్షం కావడంతో పంపిణీ జరగలేదని పలువురు చెబుతున్నారు. ఇక మున్సిపల్ అధికారులు అయితే చేతులుకట్టుకోవాల్సిన పరిస్థితి ఉండేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ఆరేళ్లుగా సబ్బులు, తలనూనెకు కార్మికులు నోచుకోలేదు.

మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేడు..: తెల్లవారుజాము నుంచి పట్టణాన్ని మెరుగు పరిచేందుకు బయలుదేరే తమకు సబ్బులు, తలనూనెలు, బూట్లు, గ్లౌజులు ఇవ్వలేదు. ఈ విషయాన్ని అడిగేంత ధైర్యం మాకు లేదు. మమ్మల్నిపట్టించుకునే నాథుడే లేడని పలువురు పారిశుధ్య కార్మికులు చెబుతున్నారు.

టెండర్లు పిలవబోతున్నాం..: పారిశుధ్య కార్మికులకు సబ్బులు, తలనూనెలు పంపిణీ చేసేందుకు త్వరలో టెండర్లు పిలవబోతున్నాం. టెండర్లు పూర్తవగానే వారికి పంపిణీ చేస్తాం.
రాముడు, మున్సిపల్ కమిషనర్, పులివెందుల.







పులివెందులలోని పలు వీధుల్లో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు


పూలే వర్ధంతిని జయప్రదం చేయండి

కడప మారుతీనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పూలే వర్ధంతిని జయప్రదం చేయాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణయ్య అన్నారు. బుధవారం స్థానిక ప్రకాశ్‌నగర్‌లోని జేసీఐపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న పాతబస్టాండులోని పూలే విగ్రహం వద్ద వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రాయలసీమ బీసీ మహాసభ నాయకులు షిండే భాస్కర్, మల్లయ్య, బండ ఎరికలయ్య, రాజుయాదవ్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

కమలాపురం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర ఇంగ్లీష మీడియం హైస్కూలు ప్రాంగణంలో మదర్‌థెరిస్సా సేవాసమితి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అభిలాష్ నేత్ర వైద్యశాల వైద్యులచే ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 200 మందికి పైగా ప్రజలు హాజరయ్యారని తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కమలాపురం మున్సిపల్ కమిషనరు బి.ప్రహ్లాద, డాక్టర్ అభిలాష్, స్కూలు కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, ట్రస్టు ఛైర్మన్ జూటూరు విజయ్‌కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.





చంద్రబాబుకు వినతిపత్రాలు అందజేస్తున్న రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్





చంద్రబాబు సమావేశానికి తరలివస్తున్న టీడీపీ కార్యకర్తలు, ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి



పెండ్లిమర్రి...చీకట్లో సెల్‌ఫోన్ వెలుగులో నడుచుకుంటూ రైతుల సమస్యలు తెలుసుకుంటున్న సీఎం చంద్రబాబు

చలికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

వల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభమైనప్పటి నుంచి చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. శివరాత్రి వచ్చే సరికి తగ్గుతూ వస్తుంది. అది వేరే విషయం. అయితే గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాల కన్నా ఎక్కువగా చలి ఉంటుంది. దీంతో ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వల్లూరు ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ ఫణీంద్ర తెలిపారు. సాయంత్రం నుంచి తలకు మంకీ మాస్కులు ధరించుకుని చేతికి గ్లౌజులు వేసుకోవాలన్నారు. వృద్ధులకు శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అలాగే గర్భిణులు కూడా చలికి బయట తిరగకుండా ఇంట్లోనే ఉండాలన్నారు. చిన్నపిల్లలకు కూల్‌డ్రింక్‌లు, చల్లని నీరు తాగించకుండా గోరు వెచ్చని నీటిని ఇవ్వాలి. ఒకవేళ ఉదయం, సాయంత్రం వేళల్లో బయటికి వెళ్లాల్సి వస్తే మాస్కులు, చలికోటు ధరించాలి.

వేముల గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతి



వేముల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయం వేములలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఇందిరా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. అలాగే 8,9,10 తరగతుల విద్యార్థులకు నేటి సమాజంలో గ్రంథాలయాలు వాటి ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నారుబోయిన గంగాధర్‌యాదవ్, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కె.వి.నాగిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు పారాల్సిందేనా..?

సీకేదిన్నె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారి కడప కార్పొరేషన్ పరిధిలోని ఊటుకూరు సచివాలయం-2 పరిధిలోని ఊటుకూరు రింగ్‌రోడ్డు వద్ద మురుగు కాలువ నిండి రోడ్డుపై పారుతున్నా అధికారులెవ్వరూ తగిన చర్యలు తీసుకోలేదు. దీంతో వాహనదారులు, ప్రజలు వివిధ రకాల వ్యాపారస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలువ పూర్తి చేయకపోవడంతో ఈ సమస్య ఎదురవుతోంది.

● **పూర్తికాని కాలువలు..:** జాతీయ రహదారి వెంబడి నిర్మించిన కాలువలు పూర్తికాకపోవడంతో నీరు పారడంలేదు. దీంతో వివిధ వ్యాపార సముదాయాల నుంచి వచ్చే మురుగునీరు కాలువ నిండి రోడ్డుపై దాదాపు అరకిలోమీటరు పైగా పారి ప్రజలకు ఇబ్బంది కలిగించడంతో పాటు దుర్వాసన వస్తోంది. దీంతో అటు వాహనదారులు, ఇటు షాపుల యజమానులు ఇబ్బందులకు గురవుతున్నారు. షాపులకు వచ్చేవారు మురుగునీటిని తొక్కుకుంటూ రావాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపై పారకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.





జాతీయ రహదారి వెంబడి దాదాపు అరకిలోమీటరు పైగా పారుతున్న మురుగు

కాలువ నిండి బయటకు వస్తున్న మురుగు

సమతుల ఆహారంతో ఆరోగ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు సమతుల్య ఆహారం తీసుకోవాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పాలక మండలి సభ్యులు, ఆరోగ్య భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైఎంఆర్ కాలనీలోని సరస్వతీ విద్యా మందిర్ హైస్కూలులో ధన్వంతరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యంతోపాటు చురుగ్గా ఉంటారన్నారు.

రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

చెప్పిన మాట మేరకు ప్రతి ఏటా రూ.రూ.20వేలు ● డిసెంబరు నెలలో అరటి ధరలు పెరిగే అవకాశం

●పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి

పులివెందుల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. బుధవారం అన్నదాత సుఖీభవ రెండో విడత విడుదల చేస్తున్న సందర్భంగా వైఎస్సార్ ఇస్లాలో వ్యవసాయశాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీటెక్ రవి పాల్గొన్నారు. ఎన్నికల సందర్భంలో కూటమి ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం ఏడాదిలో రెండో విడతలో రూ.7వేలు అందిస్తున్నామన్నారు. పులివెందుల నియోజకవర్గంలో 41980 మంది రైతులకు గాను రూ.28.31కోట్లు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఇచ్చే సబ్సిడీ డ్రిప్‌ను కూడా ఎత్తివేసిందన్నారు. మద్దతు ధర విషయంలో చీనీ, అరటి రైతులకు సరైన న్యాయం జరిగేలా చూస్తామన్నారు. చీనీ అరటి రెండూ పచ్చి సరుకు కావడంతో నిల్వ చేసేందుకు అవకాశం ఉండదన్నారు. ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా వచ్చే ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించి రైతులకు మేలు చేసే కార్యక్రమాన్ని చేపట్టబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి లతారెడ్డి, హెచ్ఎల్‌సీ ఛైర్మన్ జోగిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లు అమర్‌నాథ్‌యాదవ్, సూరారెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష, వేంపల్లె పరిశీలకుడు రఘునాథరెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అన్నదాత సుఖీభవ మెగా చెక్‌ను అందజేస్తున్న చేస్తున్న బీటెక్ రవి తదితరులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే మాధవి

(కడప-ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. బుధవారం కడప నియోజకవర్గంలోని 50వడివిజన్ పాలెంపల్లెలో నిర్వహించిన సూపర్‌సిక్స్‌లో భాగమైన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నియోజక వర్గానికి చెందిన 1576 మంది రైతులకు 98లక్షల నిధుల మెగా చెక్కును అందజేశారు.



మెగాచెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

ఉల్లి రైతు కష్టాలు తీరేదెన్నడో..?

- పరిహారంపై ఊసెత్తని అధికారులు
- ఉసూరుమంటున్న ఉల్లి రైతులు
- తోటల్లోనే ఉల్లిగడ్డల వదిలివేత
- పంటను తొలగించిన వైనం


మనేరాంపల్లిలో నెల రోజుల కిందట తీయాల్సిన ఉల్లిని వదిలివేసిన దృశ్యం

దువ్వూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెద్దబళ్లారి రకం ఉల్లి రెతుల కష్టాలు ఎవరికి పట్టవా? అంటూ అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం పంట పండించి గిట్టుబాటు ధరలేక ఒకవైపు భారీ వర్షాలతో మరోవైపు పంటలు దెబ్బతిని పొలాల్లోనే ఉల్లిగడ్డలను కొందరు వదలివేయగా మరి కొందరు రోడ్డు పక్కన. ప్రవహించే ఇలా నెల రోజులుగా సమ స్య కొనసాగుతున్నా అధికారులు తమను పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండ, వానలను లెక్కచేయక పెట్టుబడులకు ఓర్చి ఇంటిల్లిపాది కష్టపడితే చివరికి అందిన దిగుబడిని రైతులు నేలతల్లికే అర్పించారు. పంట పండితే వాటిని కొనుగోలు చేయడం సదరు క్రయ విక్రయాలు సహజంగా జరుగుతాయి. బయట గిట్టుబాటుకాని నేపథ్యంలో ప్రభుత్వాలే మార్కెటింగ్ చేయడం, లేదా పరిస్థితులు వికటిస్తే పరిహారం చెల్లించడం సహజంగా జరిగే పరిణామమే అయినా దీన్ని గురించి ఎవ్వరు ఊసెత్తడంలేదు. దీంతో రైతులు ఉసూరుమంటూ కన్నీరు పెడుతున్నా అధికారులకు కరుణ కలుగడంలేదంటున్నారు. దువ్వూరు మండలంలో ఇడమడక, నారాయణపల్లె, జిల్లేళ్ల, పెద్దభాకరాపురం, కానగూడూరు, క్రిష్ణంపల్లె, గుడిపాడు, చిన్నసింగనపల్లె, మదిరేపల్లి, మూడిండ్లపల్లె, దాసరిపల్లి, పెద్దశింగనపల్లి, రామాపురం, పుల్లారెడ్డిపేటతోపాటు దువ్వూరుప్రాంత పొలాల్లో వందలాది ఎకరాల్లో సాగైన పంటను వదిలేసిన సంఘటనలున్నాయి. ట్రాక్టర్లతో దున్నివేయడం, తోటలకు మందు పిచికారి చేయడం లాంటి సంఘటనలు జరిగాయి. ఇంత వ్యవహారం కొనసాగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు మిన్నకుండిపోయారు. కనీసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతుల బాధలు చెప్పాల్సిన సంబంధిత శాఖ చోద్యం చూస్తోందని రైతులు వాపోతున్నారు. అప్పులపాలైన వారి సంఖ్యకు కొదువ లేదు. ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిహారం ఇవ్వాలని రైతులు చేతులు జోడించి విన్నవించుకుంటున్నారు. ఈ దిశగా వ్యవసాయ, హార్టికల్చలర్‌తోపాటు జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని ఉల్లి రైతులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్‌పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థిని జింకా మునిదీపిక ప్రతిభ కనపరచి ద్వితీయస్థానంలో నిలిచింది. ఈనెల 15 నుంచి విశాఖపట్నం జిల్లా పరవాడలో 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన 150 మంది క్రీడాకారులు పాల్గొనగా పట్టణానికి చెందిన మునిదీపిక ఫైనల్ మ్యాచ్‌లో ప్రతిభ కనపరిచి ద్వితీయస్థానం సాధించింది. దీంతో ఆ విద్యార్థినిని దీప్తి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్లు బాలసుబ్బారెడ్డి, సునీల్‌బాబు, శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

మైలవరం మండలానికి ఖాజీ నియామకం

కలికిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని మైలవరం మండలానికి ఖాజీని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. జమ్మలమడుగు దుత్తలూరు నగర్‌కు చెందిన కొండపల్లి షేక్ నూరుల్లాను మైలవరం మండల ఖాజీగా నియమించారు. ముస్లిం సమాజంలో వివాహాలను అధికారికంగా నిర్వహించేందుకు పదేళ్లపాటు పదవీ కాలం నిర్ణయిస్తూ ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఆయన ముస్లిం వివాహాలను జరిపించాలని పేర్కొంటూ మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థి భరోసా యాత్ర


భరోసా యాత్రలో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు

మైదుకూరు నవంబరు19 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో బుధవారం మైదుకూరులో విద్యార్థి భరోసా యాత్ర నిర్వహించారు. స్థానిక విద్యార్థినీ, విద్యార్థులతో పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాయల కూడలిలో మానవహారం చేపట్టి ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరి మల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులను, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు రవితేజ, మాజీ జిల్లా కన్వీనర్ రవికళ్యాణ్, కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు అయ్యంకి

జమ్మలమడుగు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య అని గ్రంథాలయ అధికారి అన్నారు. గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా ఐక్యంకి వెంకటరమణయ్య ఆంధ్రాతిలక్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు, బాబాఫకృద్దీన్, కవలా రామయ్య, డిష్ రామసుబ్బారెడ్డి, పాఠకులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

భూకబ్జాలు అధికారులకు కనపడవా..?


నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కలసపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగే భూకబ్జాలు రెవెన్యూ అధికారులకు కనపడవా? అని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిళ్లపల్లె సమీపంలో 2707 సర్వేనెంబర్‌లోని భూమిని రాత్రికి రాత్రే యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారన్నారు. మండల వ్యాప్తంగా అనేకచోట్ల వైసీపీ, టీడీపీ నాయకులు భూ ఆక్రమణలకు పాల్పడుతుంటే రెవెన్యూ అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారన్నారు. మండలంలోని పేద దళితులకు 2 ఎకరాల పొలం, ఇంటి స్థలం ఇవ్వకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, సహాయ కార్యదర్శి రమణ కలసపాడు మండల కార్యదర్శి సునీల్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల్లో మౌలిక వసతులు కల్పించాలి

బద్వేలు, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పురపాలక సంఘంలోని శ్మశాన వాటికలలో మౌలిక వసతులు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ముడియం చిన్ని పేర్కొన్నారు. బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికను సందర్శించారు. జనాభాకు అనుగుణంగా మున్సిపాలిటీలో శ్మశాన వాటికలు ఉండడం లేదన్నారు. చివరి మజిలీకి అనేక అవస్థలు పడాల్సి వస్తోందని కావున అధికారులు స్పందించి శ్మశాన వాటిక మౌలిక వసతుల కల్పనకు శాశ్వతమైన చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్ షరీఫ్, కార్యదర్శి షేక్ ఆదిల్, రూరల్ కార్యదర్శి ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మనసున్న మాస్టారు నరసింహరాజు

- విద్యార్థినుల పరీక్ష ఫీజు చెల్లించి ఉదారత


ప్రదానోపాధ్యాయురాలు గంగాభవానికి ఫీజు అందిస్తున్న మాస్టారు

మైదుకూరు నవంబరు19 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు బాలికల ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రాధా నరసింహరాజు 10వ తరగతి చదువుతున్న 66 మంది విద్యార్థినులకు పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లించి తన ఉదారతను చాటుకున్నారు. గత మూడు సంవత్సరాలుగా తనే విద్యార్థినులకు స్వచ్ఛందంగా మొత్తం పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లిస్తూ మనసున్న మాస్టారు అని పలువురితో మన్ననలు పొందుతున్నారు.ఈసారి రూ.8250లు చెల్లించి దాతృత్వాన్ని చాటుకోవడంతో పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు గంగాభవాని ప్రశంసించారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):దివంగత ప్రధాని ఇందిరాగాంధీ 108వ జయంతి వేడుకలను ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ ం ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రెండు గడ్డివాములు దగ్ధం

ముద్దనూరు నవంబర్19(ఆంధ్రజ్యోతి):మండల పరిధి కోడిగాండ్లపల్లెలోరెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. రాయపాటి నాగసుబ్బారెడ్డికి చెందిన రెండు గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోగా జమ్మలమడుగు అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు.రూ.25వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

పోరాట యోధురాలు ఝాన్సీలక్ష్మీబాయి


ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గొప్ప పోరాట యోధురాలు ఝాన్సీలక్ష్మీబాయి అని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యంలో మణికర్ణిక ఉన్న ఆమె ఝాన్సీ రాజు గంగాధరావుతో వివాహమైందని, ఆ తర్వాత ఆమె ఝాన్సీలక్ష్మీబాయిగా గుర్తింపు పొందిందన్నారు. అంగ్లేయులపై ఎదురు తిరిగి వారితో వీరోచిత పోరాటం చేశారన్నారు. 1857 సిపాయిల తిరుగుబాటులో ఆమె ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, భాస్కర్‌రెడ్డి, షేక్షావలి పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శి అరెస్టు.. విడుదల

కొండాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో బుధవారం మండల సీపీఐ కార్యదర్శి మనోహర్‌బాబును పోలీసులు అదుపులోకి తీసుకుని అనంతరం సాయంత్రం వదలిపెట్టారు. సీఎం పర్యటన నేపథ్యంలో ముందుజాగ్రత్తగా ఆయనను ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం దాకా పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచుకొని తిరిగి వదిలేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని తెలిపారు. వెంటనే ముఖ్యమంత్రి చొరవ తీసుకొని గండికోట నిర్వాసితులకు పరిహారం అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇంటింటా సర్వే చేసి కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తిస్తాం

- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత

ప్రొద్దుటూరు , నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటా సర్వే చేసి కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం చేపట్టినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత తెలిపారు. బుధవారం దేవాంగ పేట అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 30 వరకు ఇంటింటికి వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ఉచితంగా చికిత్స సదుపాయాలను గురించి తెలియజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గీత మాట్లాడుతూ ఈ వ్యాధి లక్షణాల్లో చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం , చెవులపై, వీపుపై నొప్పి లేని బొడిపెలు, కనుబొమ్మల కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం కాళ్లు చేతులు తిమ్మిర్లు కలిగి వుండటమన్నారు.ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మల్టీ డ్రగ్ థెరపీ ఔషధాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అలీందౌలా, డీపీఎంవో శివశంకర య్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు హెచ్ఈవో సుబ్బరాయుడులు పాల్గొన్నారు.

రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలి

ముద్దనూరు నవంబర్19(ఆంధ్రజ్యోతి): రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలని రాయలసీమ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ పేరు పెట్టి 98 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా బుధవారం ముద్దనూరులో కుంచం మాట్లాడుతూ అఖిల పక్ష సమావేశం పెట్టి అజెండాలో ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంగా తీర్మానం చేయాలన్నారు.2029లోపు కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, కర్ణాటకలోని రాయచూరు, బళ్లారి, చిత్రదుర్గ, కోలార్, క్రిష్ణగిరి, వేలూరుతో 12 జిల్లాలు కలిపి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రంగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో రాయలసీ రాష్ట్ర సమితి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



పోరుమామిళ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్- 19 బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు మాధవీ, సుశ్మిత, వినోద్, హర్షలు పాల్గొని ప్రతిభ కనపరిచారు. వారిలో మాధవీ, సుశ్మిత ప్రతిభకనబరిచి గోల్డ్‌మెడల్ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి తెలిపారు. బుధవారం పోరుమామిళ్ల ప్రభ్తువ జూనియర్ కళాశాలలో విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు జాతీయాస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే వినోద్ మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో ఫస్ట్ స్టాండ్‌బైగా ఎన్నికయ్యారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల ఉత్పత్తి పెంచడమే లక్ష్యం

రాజుపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పశువుల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని పశుగణాభివృద్ధి జిల్లా ఎగ్జిక్యూటివ్ అధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పగిడాల గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పశు సంవర్ధకశాఖ పశుగణాబివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువుల గర్భకోశ వ్యాధుల ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్రెడ్డి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పశు వైద్యుల ద్వారా పశువుల్లో వచ్చే వ్యాధులకు చికిత్సలు చేయించుకోవాలన్నారు.

దాడులను అరికట్టాలని వినతి

జమ్మలమడుగు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన, మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటూ బుధవారం తహసీల్దారు శ్రీనివాసరెడ్డికి సీపీఐ ఏరియా కార్యదర్శి ప్రసాద్ వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జనగణనలో కుల గణన చేపట్టాలని, అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం, ఆత్మగౌరవం సమానంగా దక్కాలన్నారు. సీపీఐ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతో ఆరోగ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు సమతుల్య ఆహారం తీసుకోవాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పాలక మండలి సభ్యులు, ఆరోగ్య భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైఎంఆర్ కాలనీలోని సరస్వతీ విద్యామందిర్ హైస్కూలులో ధన్వంతరి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యంతోపాటు చురుగ్గా ఉంటారన్నారు.

రైతుల సంక్షేమానికి ఎంత చేసినా తక్కువే

- పీఎం కిసాన్ మెగాచెక్కు అందజేతలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


మెగా చెక్కును రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఇతర అధికారులు

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశానికి వెన్నముఖగా నిలిచిన రైతన్న సంక్షేమానికి వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు ఎంత చేసినా తక్కువేనని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో పీఎం కిసాన్-అన్నదాతా సుఖీభవ రెండవ విడత నిధుల విడుదల వర్చ్యువల్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాత శ్రేయస్సుకోసం కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు రెండు విడతల్లో ఆర్థికసాయం చేసిందన్నారు. ప్రొద్దుటూరు మండల పరిధిలో 4,215 లబ్ధిదారులకుగాను రూ.2.91 కోట్లు, రాజుపాళెం మండల పరిదిలో 6,111 మంది రైతులకుగాను రూ.4.11 కోట్ల ఆర్థికసహాయాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ కానున్నదని చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు రెండు విడుతలకుగాను రూ.14.04 కోట్లు రైతులకు ఆర్థికసాయం చేసిందని చెప్పారు. ఉపాధి పథకాన్ని వ్యవసాయ శాఖకు అనుసంధానం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా డీసీవో వెంకటసుబ్బయ్య వ్యవసాయ శాఖ ఏడీఏ అనిత, ప్రొద్దుటూరు, రాజుపాళెం ఏవోలు వరహరికుమార్, రామకృష్ణారెడ్డి, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, తహసీల్దారు గంగయ్య, మార్కెట్‌యార్డు కమిటీ ఛైర్మన్ వద్ది సురేఖ, చెన్నమరాజుపల్లె సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, లింగాపురం ఏజీఆర్ బ్యాంకు ఛైర్మన్ నాగమునిరెడ్డి, టంగుటూరి సొసైటీ అధ్యక్షుడు బాష, టీడీపీ నాయకులు, నియోజకవర్గ రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి


పీఎం కిసాన్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి, నేతలు

జమ్మలమడుగు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సూచించారు. బుధవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్ 2025-26 రెండవ విడత పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఆది మాట్లాడుతూ 2029 నాటికి ఆంధ్రప్రదేశ్ అన్ని విధాల అభివృద్ధి సాధిస్తుందన్నారు. డిసెంబరు నాటికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇన్సూరెన్స్ కార్యక్రమంలో భాగంగా వైద్యం ప్రతి ఒక్కరికి ఏడాదికి రూ.25 లక్షలు ఖర్చు చేస్తారన్నారు. అనంతరం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్-6 అమలులో భాగంగా రైతులకు అన్నదాతా సుఖీభవ, పీఎం కిసాన్, కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గానికి సంబందించి 35,184 మంది లబ్ధిదారులు, రూ.23.81 కోట్లు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మార్కెట్‌యార్డు ఛైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, వైస్‌ఛైర్మన్ మల్లికార్జున, యనమల శ్రీనివాసులరెడ్డి, జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ నాగార్జున, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్...సూపర్ హిట్ : ఎమ్మెల్యే పుట్టా


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్..సూపర్ హిట్‌గా ముందుకు దుసుకెళుతోందని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని కృషివిజ్ఞాన కేంద్రంలో బుధవారం అన్నదాత సుఖీ భవ.. పీఎం కిసాన్ పథకంలో భాగంగా అన్నదాతలకు రెండవ విడత చెక్కు విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సుపర్ సిక్స్ పథకాల హామీలకు నెరవేర్చుకొంటూ వెళుతోందన్నారు. అన్నదాతలకు అండగా,రైతుల పక్షపాతిగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తుందన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో 34వేల,81 మంది రైతులకు రూ.23కోట్ల,19 లక్షల యు అన్నదాతల అకౌంట్లకు వేయడం జరిగిందన్నారు. ఒక్కోక్క రైతుకు మొదటి విడత రూ.7వేలు, ఆగస్టులో వేయడం జరిగిందని, రెండో విడత రూ.7 వేలు, మూడవ విడత రూ.6వేలను కలిపి మొత్తం రూ.20వేలను వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ ఛైర్మన్ ఏపీ రవీంద్ర, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మోపూరి రమణ, అన్నవరం సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, హజరత్‌రెడ్డి, హార్టికల్చర్ అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం


అన్నదాతలకు చెక్కును అందజేస్తున్న విజయమ్మ, రితీష్‌రెడ్డి

గోపవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత లకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటోందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ రితీష్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం నియోజకవర్గంలోని గోపవరం మండలం, పెద్ద గోపవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రితీష్‌రెడ్డి మాట్లాడారు. అన్న దాత సుఖీభవ పథకం రెండో విడతగా బద్వేలు నియోజకవర్గంలో 34,148 లబ్ధిదారులకు ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులు మొత్తం రూ.23.25 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చంద్రబాబు వ్యవసాయరంగంలో ఆలోచనలు వివరించేలా కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. కార్యక్రమంలో బొజ్జ రోశన్న, బీజేపీ బొమ్మన సుబ్బరాయుడు, ప్రసాద్‌రెడ్డి, వెంగల్‌రెడ్డి, రామ్మోహనరెడ్డి, జడ్పీటీసీ జయరామిరెడ్డి, టి.రామానాయుడు, సుదాకర్‌రెడ్డి, కొండయ్య, శంకర్రెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు, దొరసానిపల్లె ఛానల్స్ సర్వే


దొరసాని పల్లె ఛానల్ ఆక్రమణలు పరిశీలిస్తున్న కమిషనర్, తహసీల్దారు

ప్రొద్దుటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రధానమైన ఐదు మురుగునీటి కాలువల్లో ప్రొద్దుటూరు ఛానల్-1,2 దొరసానిపల్లె ఛానల్స్‌లపై ఉన్న ఆక్రమణలపై సర్వేకి శ్రీకారం చుట్టారు. బుధవారం ఎమ్మెల్యేవరదరాజులరెడ్డి ఆదేశాలతో కమిషనర్ రవిచంద్రారెడ్డి, తహసీల్దారు గంగయ్య మండల సర్వేయర్ వెంకటలక్ష్మి, విలేజ్ సర్వేయర్ల బృందం దొరసానిపల్లె ఛానల్‌ను పరిశీలించారు. దొరసానిపల్లె ఛానల్ కుండా షాపువీధికి వెళ్లే దారిలో పూర్తిగా ఆక్రమణకు గురైనట్లు పరిశీలించారు. దొరసానిపల్లె ఛానల్ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి ఇంటి దగ్గర నుంచి మొదలై శ్రీనివాస నగర్ దగ్గర మడూరు కాలువలో కలుస్తుంది. ఈ కాలువ పొడవున ఉన్న ఆక్రమణలు గుర్తించి వాటికి వారంలోపు మార్కింగ్ ఇచ్చేందుకు రోవర్ సహాయంతో కొలతలు వేయనున్నారు. అలాగే ప్రొద్దుటూరు చానల్స్ కూడా దొరసానిపల్లెలో మొదలై శ్రీనివాస నగర్ దగ్గర మడూరుకాలువలో కలుస్తాయి. ఈ చానల్‌పై కూడా ఆక్రమణలుగుర్తించి మార్కింగ్ ఇవ్వనున్నారు. మొత్తం ఎన్నికట్టడాలు ఆక్రమణలో ఉన్నాయనేది పదిరోజుల్లో జాయిట్ సర్వేలో వెల్లడించి మార్కింగ్ పూర్తి చేస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు.

మురుగు కాలువల్లో వ్యర్థాలు తొలగించేలా చూడండి

ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):మురుగు కాలువల్లో వ్యర్థాలు తొలగించి రోడ్లపై నీరుపారకుండా చూడాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని 13వ వార్డు శ్రీరాములపేటలో ప్రధాన కాలువకు వెళ్లే అప్రోచ్ కాలువ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువల్లో వ్యర్థాలు సక్రమంగా తొలగించకపోవడంతో కాలువ దెబ్బతిని మురుగునీరు రోడ్లమీదకు చేరి వాహనదారులకు, స్థానిక ప్రజలకు అసౌకర్యంతోపాటు దుర్వాసన వెదజల్లుతోందన్నారు. మున్సిపల్ కమిషనర్‌తోపాటు సంబంధిత అధికారులకు కాలువ పనులను తక్షణమే చేపట్టాలని విజ్ఞప్తి చేశానన్నారు. ఇందుకు స్పందించిన అధికారులు మురుగునీటి నిలువలను తొలగించి కాలువ నిర్మాణం పనులను వేగవంతం చేశారన్నారు.